సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 9 । జూలై । 2024



నేత్ర పర్వంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది.



సమస్యల పరిష్కారానికి కృషి

మారుమూల గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్ అన్నారు.

8లో



నేడు అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్(విశాఖ): కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు.

నిను మరువలేం రాజన్నా..!

మరపురాని మహానేత వైఎస్సార్‌ను ప్రజలు గుండెల్లో దాచుకున్నారు.. ఆయన అందించిన సేవలను స్మరించుకుంటూనే ఉన్నారు.. రాజన్న చల్లని చూపుతో బాగుపడిన కుటుంబాలు కృతజ్ఞతతో ఇప్పటికీ ఆయనను ఆరాధిస్తున్నాయి. అందుకే ఆయన భౌతికంగా దూరమై 15 సంవత్సరాలు గడిచినా జనం హృదయాల్లో చిరంజీవిగా ఉన్నారు. సోమవారం ఆయన 75వ జయంతిని జిల్లా అంతటా ఘనంగా జరిపారు. అభిమానులు వైఎస్సార్ విగ్రహాలు, ఫొటోలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించడమే కాక అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి ఆ మహనీయుని బాటలో నడిచారు. – సాక్షి న్యూస్ నెట్‌వర్క్

సాక్షి, పాడేరు: పేదల సంక్షేమానికి విశేషంగా కృషి చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి జనం హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి పోతారని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. వైఎస్సార్ 75వ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రం పాడేరులోని పాతబస్టాండ్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ అమలు చేసిన, ఆరోగ్య శ్రీ, ఉచిత విద్యుత్ వంటి పథకాలు గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపాయన్నారు. అటవీ భూములకు హక్కుపత్రాలు అందజేసి అడవి బిడ్డలకు మేలు చేశారని చెప్పారు. మహానేత మరణానంతరం ఆయన ఆశయ సాధనే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీని ఏర్పాటు చేశారని, అనేక పోరాటాల ద్వారా 2019లో సీఎం అయిన జగనన్న ఐదేళ్ల పాటు అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా వినూత్న కార్యక్రమాలు అమలుజేశారని ఆయన తెలిపారు.

2029లో మళ్లీ జగనే సీఎం

మహానేత వైఎస్సార్ ఆశయాలు పూర్తిస్థాయిలో అమలు కావాలంటే 2029లో మళ్లీ సీఎంగా జగనన్నను చేసుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నేరవేర్చని పక్షంలో ప్రజల పక్షాన పోరాటాలకు సిద్ధంగా ఉండాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

రోగులకు పాలు, రొట్టెల పంపిణీ

పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు స్థానిక జిల్లా ఆస్పత్రిలో రోగులను పరామర్శించి, పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్

- ఘనంగా దివంగత సీఎం రాజశేఖర రెడ్డి జయంతి
- గ్రామగ్రామాన నివాళులర్పించిన అభిమానులు, పార్టీ నాయకులు
- పెద్ద ఎత్తున జిల్లా వ్యాప్తంగా సేవాకార్యక్రమాలు

ఎంపీపీ కుంతూరు కనకాలమ్మ,పాడేరు మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు,పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి లకే రామసత్యవతి, జిల్లా పంచాయతీరాజ్ విభాగం పార్టీ అధ్యక్షులు గబ్బాడ చిట్టిబాబు,ఎస్టీసెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కూడా సురేష్‌కుమార్, జోనల్ ఇన్‌చార్జి కిముడు విశ్వ, సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు తెడబారికి సురేష్‌కుమార్, సర్పంచ్‌లు బసవన్నదొర, రాంబాబు, సన్నిబాబు, రాంనాయుడు, ఎంపీటీసీలు సన్యాసిరావు,రామకృష్ణపాత్రుడు, సల్లా చిట్టమ్మ, మాజీ సర్పంచ్‌లు పాంగి నాగరాజు,కన్నాపాత్రుడు,పాంగి సత్తిబాబు,సూర్యనారాయణ, పార్టీ నాయకులు కూడా సుబ్రహ్మణ్యం,కొట్టగుళ్లి నాగేంద్ర,కోడా సుశీల,బూర మహేష్,పాంగి రాంగోపాల్,కొట్టగుళ్లి కొండాజీ.జనపరెడ్డి రమణ పాల్గొన్నారు.



పాడేరులో మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు,పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి,పార్టీ నాయకులు

న్యూస్‌రీల్

పలు గ్రామాల్లో భారీ వర్షాలు



యండపల్లివలస ప్రధాన రహదారిపై నిలిచిన వర్షం నీరు

అరకులోయ రూరల్/పాడేరు: జిల్లాలో పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల కారణంగా గ్రామాల్లో రోడ్లు జలమయమయ్యాయి. అరకులోయ మండల వ్యాప్తంగా సోమవారం కుండపోతగా వర్షం కురిసింది. ప్రధాన రహదారిపై యండపల్లివలస గంగమ్మ తల్లి ఆలయం సమీపంలో, సినిమా హాల్ వంతెనపై వర్షం నీరు చేరింది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్రఇబ్బందులకు గురయ్యారు. పాడేరు పట్టణంలోని ఫారెస్ట్ క్వార్టర్స్‌కు ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై సోమవారం ఉదయం ఓ భారీ చెట్టు విరిగి పడింది.దీంతో పాడేరు–జి.మాడుగుల మార్గంలో సుమారు గంటపాటు వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. ఆ ప్రాంతంలో కొద్ది సేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



పాడేరులో రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన చెట్టు


12న అపోలో ఫార్మసీలో ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు

రంపచోడవరం: అపోలో ఫార్మసీలో ఉద్యోగాల భర్తీకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ ఉదయం 10 గంటల నుంచి స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఆ సంస్థ జిల్లా అధికారి జి.ప్రశాంత్ కుమార్ తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బి–ఫార్మసీ ఉత్తీర్ణులైన, 18– 30 సంవత్సరాల మధ్య వయసు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు పాన్ కార్డు,ఆధార్ కార్డు, విద్యార్హత సరిఫికెట్ల జిరాక్స్ కాపీలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని చెప్పారు. మరిన్ని వివరాలకు 9398338105 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నిరుద్యోగులకు ప్లంబింగ్‌లో శిక్షణ

మహారాణిపేట(విశాఖ):నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (నేక్) ఆధ్వర్యంలో రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ప్లంబింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈమేరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 8వ తరగతి విద్యార్హత కలిగిన వారికి సుమారు 3 నెలల పాటు ప్లంబింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వి.ఎస్.ఎస్.రవికుమార్ తెలిపారు. జిల్లా పరిషత్ సమీపంలోని నేక్ కేంద్రంలో స్త్రీ, పురుష అభ్యర్థులకు వేర్వేరుగా శిక్షణ ఇవ్వనున్నామన్నారు. దరఖాస్తులకు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని, నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 98668 83199, 85005 02395 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా పరిషత్ దగ్గర ఉన్న నేక్ కార్యాలయంలో అందజేయాలని చెప్పారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ భారతి

చింతపల్లిరూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 సంవత్సరంలో ప్రవేశానికి ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయ భారతి తెలిపారు. ఈనెల 10వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె చెప్పారు. 11 నుంచి 15వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదు, 19న సీట్లు కేటాయింపుఉంటాయన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7569163403, 8500406280 అనే నంబర్లలో సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

గురుకులంలో 20 సీట్లు ఖాళీ

కొయ్యూరు: స్థానిక గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో 20 సీట్లు ఖాళీగా ఉన్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ మోహన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష నిర్వహించి మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామని, ఆసక్తి గల విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

పేదల గుండెల్లో సుస్థిర స్థానం



అరకు ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

అరకులోయటౌన్: దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదల పక్షపాతి అని, పేదల గుండెల్లో ఆయన చిరస్థాయిగా ఉండిపోతారని, ఆయన సేవలను గిరిజనులు ఎప్పటికీ మరిచిపోరని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. అరకులోయలో సోమవారం దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వైఎస్సార్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ వైఎస్సార్ ఆశయ సాధన కోసం తాము నిరంతరం కృషి చేస్తామన్నారు. రాజశేఖర రెడ్డి స్ఫూర్తితో గత ఐదేళ్లు జగనన్న పలు సంక్షేమ పథకాలు అమలు చేశారని చెప్పారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త ఐక్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉషారాణి, ఎంపీటీసీలు దురియా ఆనంద్ కుమార్, శత్రుఘ్న, సర్పంచ్‌లు సుస్మిత, రాధిక, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శోభ సోమేశ్వరి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎల్.బి. కిరణ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు,మార్కెట్ కమిటీ చైర్మన్ రాజరమేష్, పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, హుకుంపేట మాజీ ఎంపీపీ రవి ప్రకాష్, వార్డు సభ్యుడు శివ, మాజీ సర్పంచ్ పాంగి చిన్నారావు, ముఖ్యనాయకులు పి.విజయ్‌కుమార్, ఎస్.అప్పాలు, ఎం.టి.ఆర్ సాంబయ్య, సుబ్రయ్య, ప్రకాష్, ఎం.బాల తదితరులు పాల్గొన్నారు. అనంతరం అరకులోయ ఆస్పత్రిలో రోగులకు ఎమ్మెల్యే మత్స్యలింగం పళ్లు పంపిణీ చేశారు.

బడుగుల ఆశాజ్యోతి వైఎస్సార్



ముంచంగిపుట్టులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర,సర్పంచులు,ఎంపీటీసీలు, అభిమానులు

ముంచంగిపుట్టు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బడుగుల ఆశాజ్యోతి అని ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండల కేంద్రం ముంచంగిపుట్టులో సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నేతలు,కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో వైఎస్సార్ జయంతిని సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు పద్మారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర పూలమాలలు వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక సీహెచ్‌సీలో రోగులు, గర్భిణులకు, రొట్టెలు, బిస్కెట్‌లు,పాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ నిత్యం ప్రజాశ్రేయస్సు కోసం తపించారని, మరుపురాని సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న గొప్ప వ్యక్తి అని తెలిపారు. మహానేత ఆశయ సాధన కోసం జగనన్న ఆధ్వర్యంలో పనిచేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరబీరు జగబందు, సర్పంచ్‌లు రమేష్, నరసింగరావు, బాబూరావు, గంగాధర్, నీలకంఠం, నోబిన, రత్న, ఎంపీటీసీలు సుబ్బలక్ష్మి, కమల, గణపతి, నోబ్బో, మండల నేతలు గాసిరావు, జయదేవ్, సన్యాసిరావు, మూర్తి, రాజారావు, రామ్మూర్తి, తిరుపతి, పులిరాజు, దాసు, సుభాష్, జగన్నాథం,మణి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అరాచకాలకు భయపడే ప్రసక్తే లేదు

- క్యాంప్ ఆఫీసు ఆక్రమణపై జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: టీడీపీ నాయకులు దాడులకు, అరాచకాలకు పాల్పడితే వైఎస్సార్‌సీపీ శ్రేణులు భయపడే ప్రసక్తేలేదని విశాఖ ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. స్థానిక ఐటీడీఏ క్వార్టర్స్‌లో ఉన్న తన క్యాంప్ ఆఫీసు తాళాలను బద్దలుగొట్టి, భవనాన్ని ఆక్రమించి, టీడీపీ కార్యాలయం ప్రారంభించడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తన గృహంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. తన క్యాంప్ కార్యాలయాన్ని టీడీపీ శ్రేణులు ఆక్రమించిన తీరు పూర్తిగా చట్టవిరుద్ధమన్నారు. అధికారం వచ్చిన వెంటనే ప్రజా సంక్షేమం కోసం ఆలోచించాలి తప్ప, వైఎస్సార్‌సీపీ కార్యాలయాలు, క్యాంప్ ఆఫీసులపై దాడులు,ఆక్రమణలు చేయడం తగదన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో నిత్యం ప్రజల కోసమే పనిచేశామని, టీడీపీ నేతలపై ఎటువంటి కక్ష సాధింపులకు పాల్పడలేదని చెప్పారు. తక్షణమే తన క్యాంప్ ఆఫీసుకు కట్టిన టీడీపీ జెండాలు,బ్యానర్లు తీయాలన్నారు. టీడీపీ నేతల తీరుపై ఇప్పటికే ఉన్నతాధికారులకు, ముంచంగిపుట్టు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. మండల టీడీపీ నేతల తీరు మారకపోతే ప్రజాగ్రహంతో పాటు వైఎస్సార్‌సీపీ ఆగ్రహానికి గురికాక తప్పదని ఆమె హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ సీతమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు,వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యం ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ



మాట్లాడుతున్న కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

చింతపల్లిరూరల్: ఎల్లప్పుడూ ప్రజల పక్షాన్నే వైఎస్సార్‌సీపీ నిలుస్తుందని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలో అన్ని పంచాయతీల సర్పంచ్‌లు,ఎంపీటీసీలు,వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సోమవారం మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గిరిజనులు వైఎస్సార్‌సీపీపై నమ్మకం ఉంచి గత మూడు సార్లుగా గెలుపిస్తున్నారన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అభివృద్ధి కార్యక్రమాల్లో సర్పంచ్‌లు తప్పక పాల్గొనాలని సూచించారు. ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ పోతు రాజుబాలయ్య, మండలసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత, వైస్ ఎంపీపీలు వెంగలరావు, శారద,కో–ఆప్షన్ సభ్యులు నాజర్‌వలీ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ పనులు వేగవంతం

- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలు



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్



సమావేశానికి హాజరైన ఇంజినీరింగ్ అధికారులు

సాక్షి, పాడేరు: జిల్లాలో జరుగుతున్న అన్ని ఇంజినీరింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్లలో జరుగుతున్న ఇంజినీరింగ్ పనులపై ఆయాశాఖల అధికారులతో కలెక్టరేట్ సమావేశమందిరంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ పరిధిలోని విద్యాలయాల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులు, సీసీడీపీ, ఎస్‌సీఏ, ఆర్టికల్ 275, పీఎం జన్‌మన్, ఎన్ఆర్‌హెచ్ఎం పనులు, స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణం ప్రగతి, పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ఆరాతీశారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన రోడ్ల నిర్మాణంపై పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఏకలవ్య మోడల్ స్కూళ్లు,గోకులం షెడ్ల పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. అన్ని అభివృద్ధి పనులతో పాటు ప్రభుత్వ ప్రాధాన్యత నిర్మాణాలన్నీ నాణ్యతగా జరగాలని, కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారు. చింతూరు డివిజన్‌లో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రోడ్లు నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్‌తో పాటు వర్చువల్ విధానంలో రంపచోడవరం,చింతూరు ఐటీడీఏ పీవోలు సూరజ్ గనోరే, చైతన్య,గిరిజన సంక్షేమశాఖ ఈఈలు డి.వి.ఆర్.ఎం.రాజు, కె.వేణుగోపాల్,మురళీ,ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు,పంచాయతీరాజ్ ఈఈలు టి.కొండయ్య పడాల్,శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ నమోదుకు ఇంటింటా సర్వే

జిల్లాలో ప్రతి ఒక్కరికీ ఆధార్ నమోదు చేయాలని, ఆధార్ కార్డు ఉన్నవారు పదేళ్లు దాటితే తప్పనిసరిగా మరోసారి అప్‌టు డేట్ చేయించుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు.ఆధార్ అప్‌టు డేట్, బయోమెట్రిక్‌లకు సంబంధించి జిల్లాలోని ఐటీడీఏ పీవోలు, ఎంపీడీవోలు,తహసీల్దార్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధార్ నమోదుకు మంగళవారం నుంచి గ్రామసచివాలయాల పరిధిలో ఇంటింటా సర్వే జరపాలని ఆదేశించారు. ఏఎన్ఎంలు మినహా సచివాలయాల ఉద్యోగులంతా సర్వేలో పాల్గొనాలన్నారు. ఆధార్ నమోదు కేంద్రాల సమాచారం ప్రజలకు అందించాలని తెలిపారు. గత రెండేళ్లలో సంభవించిన వరదలకు సంబంధించిన డీసీ బిల్లులను ముంపు మండలాల తహసీల్దార్లు డ్రా చేశారని, వారంతా బిల్లులతో పాటు యుటిలైజేషన్ పత్రాలు సమర్పించాలన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో చేసిన ఖర్చులకు సంబంధించిన బిల్లులను వెంటనే అందజేయాలని ఎన్నికల ఆర్‌వోలు,నియోజకవర్గ ప్రధాన కేంద్రాల్లోని తహసీల్దార్‌లను కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జేసీ భావన వశిష్ట,డీఆర్‌వో పద్మావతి,డీపీవో కొండలరావు,డీఈవో బ్రహ్మజీరావు,డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా,డీఎల్‌పీవో పి.ఎస్.కుమార్‌లు పాల్గొన్నారు.

సారాపై భగ్గుమన్న మహిళలు 8లో

ఆకలి తీరాలంటే గెడ్డ దాటాల్సిందే 8లో

క్లుప్తంగా

వినియోగదారుల చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జిల్లా వినియోగదారుల సంఘం సమాఖ్య ప్రధాన కార్యదర్శి రమేష్

జి.మాడుగుల: స్థానిక ఉన్నత పాఠశాలలో జిల్లా వినియోగదారుల సమాఖ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు వినియోదారుల చట్టాలు, హక్కులపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వినియోగదార్ల సంఘం సమాఖ్య ప్రధాన కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు వినియోగదారుల హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు రశీదు పొందాలని సూచించారు. హెచ్ఎం నాగ రాజు, శ్రీను. ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



కూనవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది, విద్యార్థులు

కూనవరం: వర్షాకాలం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దోమలు విస్తృతంగా పెరిగే అవకాశం ఉందని తద్వారా డెగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డెంగ్యూ నివారణ మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, డ్రమ్ములపైనా, గాబులపైనా తప్పనిసరిగా మూతలు ఉండాలని, ప్రతీ ఇంట్లో దోమతెరలు వాడలని సూచించారు. జ్వరం వంటి లక్షణాలు కన్పిస్తే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. సూపర్‌వైజర్ డీ శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



విద్యార్థినులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల–1ను సోమవారం జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆకస్మికంగా తనిఖీ చేశారు. 8,9,10 తరగతుల విద్యార్థులతో మాట్లాడి ఆశ్రమంలో సమస్యలను తెలుసుకున్నారు. తాగునీరు, మరుగుదొడ్ల సమస్యలను విద్యార్థినులు చైర్ పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. విద్య బోధనపై ఆమె ఆరా తీశారు.విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించిన జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర మాట్లాడుతూ అన్ని సబ్జెక్టుల్లో విద్యార్థులు పట్టు సాధించే విధంగా బోధన ఉండాలన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి,వారిని మెరుగైన స్థితికి చేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కిరణ్‌కుమార్,ఎంఈవో కృష్ణమూర్తి, పీఆర్ ఏఈఈ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రహరీ నిర్మాణానికి సోమవారం జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీడీవో కార్యాలయం చుట్టూ గోడ నిర్మాణానికి జెడ్పీ నిధులు రూ.33 లక్షలు కేటాయించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సీతమ్మ,సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన
అరకు ఎంపీ దంపతులు

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి,భారతి దంపతులను పులివెందులలోని వారి స్వగృహంలో అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి, ఆమె భర్త చెట్టి వినయ్‌లు సోమవారం కలిశారు.అలాగే ఇడుపులపాయలోని మహానేత డాక్టర్ వైఎస్సార్ జయంతి కార్యక్రమంలోను వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబంతో పాటు ఎంపీ తనూజరాణి పాల్గొన్నారు. వైఎస్ రాజశేఖర రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు.



వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, భారతి దంపతులతో అరకు ఎంపీ తనూజరాణి, వినయ్

మహిళల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఐద్వా మహిళ సంఘం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

అరకులోయ రూరల్: మహిళల హక్కుల పరిరక్షణకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని మహిళ సంఘం, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి తెలిపారు. మండల కేంద్రం స్థానిక గిరిజన భవనంలో ఐద్వా సంఘం ఆద్వర్యంలో సోమవారం మహిళలకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు మహిళలపై రోజురోజుకు హింసలకు పాల్పడుతున్నరన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులపై అందరూ సమష్టిగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మహిళలు చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రెండు రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులో అధిక సంఖ్యలో మహిళలు హాజరు కావలన్నారు. మహిళలు అందరూ చైతన్యవంతులు అయితేనే మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యాచారాలు నిర్మూలన సాధ్యపడుతుందన్నారు. మగవారికి సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవతీసుకుని గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు, జయ, కౌసల్య, హైమవతి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

డౌనూరు ఆశ్రమ పాఠశాలకు ఆర్వో ప్లాంట్



పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ వద్ద గిరిబాబు, హెచ్ఎం, ఇతర ఉపాధ్యాయులు

కొయ్యూరు: ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థకు చెందిన జలుమూరి వెంకట గిరిబాబు మండలంలో డౌనూరు ఆశ్రమ పాఠశాలకు ఆర్వో వాటర్ ప్లాంట్‌ను అందజేశారు. వర్షాకాలంలో కలుషిత నీటిని తాగడం వల్ల విద్యార్థులు వ్యాధుల బారిన పడుతున్నారని తెలుసుకున్న ఆయన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వెంకట గిరిబాబు మాట్లాడుతూ రూ.40 వేలతో ప్లాంట్‌ను ఏర్పాటు చేశామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హెచ్ఎం ప్రభుదాస్, వార్డెన్ హరిదేవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు గిరిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

సబ్ కలెక్టర్ ప్రశాంత్

రంపచోడవరం: ఏజెన్సీలోని మారుమూల గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు కృషి చేయాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్ అన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశం హాలులో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రా సెల్ సిస్టం కార్యక్రమం సందర్భంగా వివిధ శాఖల అధికారులతో ప్రజా సమస్యలపై చర్చించారు. అనంతరం పలువురు నుంచి అర్జీలు స్వీకరించారు. వై.రామవరం మండలం ఎగువ ప్రాంతంలోని బొడ్డగండిలో కమ్యూనిటీ భవనం, మెట్టగూడెం నుంచి పులికొండ వరకు మూడు కిలోమీటర్ల మెటల్ రోడ్డు నిర్మించాలని ఆయా గ్రామస్తులు అర్జీలు అందజేశారు. బొడ్డగండి పంచాయతీలోని 19 గ్రామాలకు చెందిన కొండ రెడ్డి కులస్తులకు పక్కాగృహాలు మంజూరు చేయాలని మంగంపాడు గ్రామానికి చెందిన సారం కోట అబ్బాయి రెడ్డి, నైని లచ్చిరెడ్డి దరఖాస్తులు సమర్పించారు. మారేడుమిల్లి మండలం పొట్లవాడ, కెచ్చలవాడ మధ్యలో కాల్వపై వంతెన నిర్మించాలని ఆగ్రామానికి చెందిన పల్లాల కృష్ణారెడ్డి, సాదల బుల్లెమ్మ దరఖాస్తు సమర్పించారు. వై.రామవరం మండలం పాతకోట పంచాయతీలోని గోరుకుల గొంది నుంచి పాతకోట వరకు సుమారు ఏడు కిలోమీటర్ల మెటల్ రోడ్డు నిర్మించాలని ఆ గ్రామానికి చెందిన గొల్లూరి ప్రభాకర్, కొర్ర దొమ్ము దరఖాస్తు సమర్పించారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్ రాజ్, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె. దేవేంద్రుడు,ఏడీఎంహెచ్‌వో జి.శిరీష, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, వెలుగు ఏపీడీ ఎ. శ్రీనివాస రావు, డీఎల్‌పీవో రాఘవన్, డాక్టర్ ఇందిరా, డీఎల్‌డీవో కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆకలి తీరాలంటే.. గెడ్డ దాటాల్సిందే

- నిత్యావసర సరకుల కోసం ప్రమాదకర గెడ్డ దాటుతున్న గ్రామస్తులు
- ఓనుకొండకు కానరాని రహదారి



ఓనుకొండ గెడ్డను దాటుకుంటూ నిత్యావసర సరకులు తెచ్చుకుంటున్న గిరిజనులు

అనంతగిరి: ప్రాణాలు తెగించి గెడ్డ దాటితే తప్ప ఆ కుటుంబాలకు నిత్యావసర సరకులు అందని దుస్థితి.. మండలంలోని లంగుపర్తి పంచాయతీ ఓనుకొండ గ్రామంలోని 40 కుటుంబాల గిరిజనులు జీవిస్తున్నారు. గిరిజనులు గ్రామ సమీపంలోని గెడ్డను దాటుకుంటూ తరచూ రాకపోకలను సాగిస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుంది. సోమవారం కొంతమంది గిరిజనులు నిత్యావసర సరకులు తెచ్చుకునేందుకు ప్రాణాలకు తెగించి, గెడ్డను దాటుకుంటూ వెళ్లారు. గెడ్డ దాటితే తప్ప ఆకలి తీరడం లేదంటూ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఓనుకొండ గ్రామానికి మేలు జరిగేలా రోడ్డు నిర్మాణంతో పాటుగా వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

వేగవంతంగా పనుల పూర్తి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: ఐటీడీఏ పరిధిలో వివిధ ఇంజినీరింగ్ విభాగాల ద్వారా చేపట్టిన పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన వివిధ శాఖల ఇంజినీర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. శాఖలవారీగా పనులపై ఆరా తీశారు.గోకులం షెడ్ల నిర్మాణం, ఏకలవ్య పాఠశాలలు, వంతెన సంబంధించిన పనులు ఏదశలో ఉన్నాయో తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఇంజినీర్లు గౌతమి, చైతన్య, సాయి సతీష్, ఏఈఈలు సత్యనారాయణ, భాను, ఉమామహేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావు, ప్రదీప్ పాల్గొన్నారు.

సారాపై భగ్గుమన్న మహిళలు

13 సారా డ్రమ్ములను తగులబెట్టిన వైనం



సారా తయారీకు ఉపయోగించే పాత్రలను ధ్వంసం చేస్తున్న మహిళలు



అటవీ ప్రాంతంలో పట్టుబడ్డ సారా బట్టీ సామగ్రి

రాజవొమ్మంగి : మండలంలోని వాతంగి పంచాయతీ కొమరాపురం గ్రామంలో స్థానిక మహిళలు సారా బట్టీలపై మరో సారి దాడి జరిపారు. ఈ దాడిలో వాతంగి, ఓగిపాలెం, ఓకుర్తి గ్రామాలకు చెందిన సుమారు రెండు వందల మంది మహిళలు ఉద్యమంగా తరలి వెళ్లారు. కొమరాపురం అటవీ ప్రాంతంలో సారా బట్టీలు నిర్వహిస్తున్న ప్రాంతంలో లభించిన సుమారు 400 కిలోల బెల్లం తగులబెట్టారు. 13 డ్రమ్ముల్లో నిల్వ చేసిన పులుపును నేలపాలు చేసి ప్లాస్టిక్ డ్రమ్ములకు నిప్పు పెట్టారు. మహిళలు తమకు లభించిన సరకులను, వస్తువులను కొమరాపురం గ్రామం నిడిబొడ్డుకు తీసుకొని వెళ్లి అందరూ చూస్తుండగా అగ్నిపాలు చేయడం విశేషం. అటవీ ప్రాంతంలో అణువణువునా వెతికి మహిళలు ఈ దాడులకు పూనుకొన్నారు. మహిళలు వస్తున్నారని తెలిసిన సారా బట్టీల నిర్వహకులు సారా బట్టీ సామగ్రిని చాలా వరకు వేరే ప్రాంతానికి తరలించుకొని పోయినట్లు సమాచారం. ఈ సారా ఉద్యమం ఇంతటితో ఆగదని, ఈ ప్రాంతంలో సారా పూర్తిగా నిర్మూలించే వరకు విశ్రమించేది లేదని శపథం పూనారు. కాగా వాతంగి పరిసర ప్రాంతాల్లో సారా బట్టీలు ఎక్కువగా ఉన్నాయన్న సమాచారం మేరకు జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు ఆదివారం ఆ ప్రాంతానికి వెళ్లారు. సారా బట్టీలపై సమాచారం ఇస్తే చర్యలు తీసుకొంటామని స్థానిక మహిళలకు హామీ ఇచ్చారు.

ప్రతి ఒక్కరికి బీమా అవసరం



చంద్రశేఖర్‌కు చెక్కును అందజేస్తున్న ఆర్ఎం, పక్కన బీఎం, క్యాషియర్

కొయ్యూరు: ప్రతి ఒక్కరూ బీమా కలిగి ఉండాలని ఏపీ గ్రామీణ వికాస బ్యాంకు అనకాపల్లి ప్రాంతీయ మేనేజర్ (ఆర్ఎం) సతీష్‌చంద్ర చెప్పారు. మండలంలోని మంప పంచాయతీ కించవానిపాలెనికి చెందిన కంకిపాటి చంద్రశేఖర్‌కు బ్రాంచ్ మేనేజర్ సతీష్‌కుమార్‌తో కలిసి బీమా చెక్కును ఆయన అందజేశారు. సతీష్‌చంద్ర మాట్లాడుతూ బీమాతో ప్రతీ కుటుంబం దీమాగా ఉండవచ్చన్నారు. పీఎం జీవన్‌జ్యోతి, యోజన తదితర పథకాలపై అవగాహన కల్పించారు. క్యాషియర్ మురళీకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీపీసీ సింహాద్రి ఆవిర్భావ దినోత్సవం

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఆవిర్భావ దినోత్సవాన్ని సంస్థ పరిపాలన భవనం ప్రాంగణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సంస్థ హెడ్ ఎస్.కె.సిన్హా ఎన్టీపీసీ జెండాను ఆవిష్కరించి గీత్‌ను ప్రారంభించారు. కేక్ కట్ చేసి ఉద్యోగులకు తినిపించారు. అనంతరం ప్రాజెక్టు హెడ్ సిన్హా మాట్లాడుతూ సింహాద్రి పవర్ స్టేషన్ అనేక అడ్డంకులు, సవాళ్లను అధిగమించి శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రతిభ కనబర్చినందుకు ఉద్యోగులను ప్రత్యేకంగా అభినందించారు. 2023 – 2024లో సంస్థ సాధించిన విజయాన్ని ప్రశంసించారు. 2024 – 2025లో నిర్దేశించిన మైలురాళ్లను చేరుకోవడానికి కష్టపడి పనిచేయాలని ఉద్యోగులను కోరారు. వేడుకల్లో భాగంగా స్వచ్ఛత పక్వాడా, ప్రపంచ పర్యావరణ దినోత్సవం, అంతర్జాతీయ యోగా దినోత్సవ పోటీల్లో విజేతలకు ప్రాజెక్టు హెడ్ సిన్హా బహుమతులు అందజేశారు. ప్రాజెక్టు హెడ్ సిన్హా సంస్థలో పలు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సీపీజీ – 3 చీఫ్ జనరల్ మేనేజర్ పరిదా, మెయింటెనెన్స్ జీఎం డేవిడ్, వీపీజీ జీఎం గద్దం, దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూసిన్హా, హెచ్ఆర్ హెడ్ పాత్ర ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన జల్‌శక్తి అభియాన్



విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ,సిబ్బంది

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో గత వారం రోజులుగా నిర్వహించిన జల్‌శక్తి అభియాన్ కార్యక్రమం సోమవారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఆట పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో సమర్ధవంతమైన నైపుణ్యం సాధించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ చలపతిరావు, సిబ్బంది ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేస్తున్న గంజాయి, పట్టుబడ్డ నిందితులతో పోలీసులు

చింతపల్లి రూరల్ : అక్రమంగా ఇతర రాష్ట్రాల నుంచి ఏజెన్సీ ప్రాంతం మీదుగా మైదాన ప్రాంతాలకు తరలిస్తున్న 3.5 కిలోల గంజాయిని సోమవారం స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ అరుణ్ కిరణ్ తెలిపారు. గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులు స్థానిక ఏపీఆర్ కళాశాల వద్ద గంజాయితో బస్సు కోసం వేచి ఉండగా , ఈ తరుణంలో పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు తన సిబ్బందితో దాడి జరిపి నిందితులను పట్టుకున్నామన్నారు. ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం(విశాఖ): విశాఖ రైల్వేస్టేషన్ కేంద్రంగా గంజాయి రవాణా చేస్తున్న నలుగుర్ని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. విశాఖ జీఆర్పీ ఎన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణల ఆధ్వర్యంలో విశాఖ రైల్వేస్టేషన్‌లో సోమవారం పలు ప్లాట్‌ఫారాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో హర్యానాకు చెందిన జితేందర్ (38), జితేందర్ (33), దీపక్(32), రాజ్‌కుమార్‌ల బ్యాగులను తనిఖీ చేశారు. రూ1.58లక్షల విలువైన సుమారు 31.6 కేజీల గంజాయిని అక్రమంగా రవాణా చేయడం గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని వీరిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

పక్కాగా గిరి ప్రదక్షిణ ఏర్పాట్లు



గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట(విశాఖ): ఈనెల 20న నిర్వహించనున్న సింహాచలం గిరి ప్రదక్షిణ పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా చూడాలని సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై సమన్వయ అధికారులతో సోమవారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ తెల్లవారుజాము నుంచి 21 సాయంత్రం వరకు గిరిప్రదక్షిణ జరగనున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ బందోబస్తుతోపాటు పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. క్యూలైన్లు, రద్దీ ప్రదేశాలు వద్ద తోపులాటలు జరగకుండా బందోబస్తును ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యంతో పాటు రద్దీ ప్రదేశాల్లో లైటింగ్ ఏర్పాటు చేయాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. ఆలయ ఈవో శ్రీనివాస మూర్తి సూచనల మేరకు అంబులెన్సులు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, అలాగే వోఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో పాటు ఒక వైద్యుడు, ఏఎన్ఎం లేదా ఆశా వర్కర్లను శిబిరాల వద్ద ఏర్పాటు చేయాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. రద్దీ ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ సదుపాయం ఉండాలని, అవసరమైతే జనరేటర్లను సిద్ధం చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. అప్పుఘర్ వద్ద అధిక సంఖ్యలో భక్తులు స్నానాలు చేసే సమయంలో ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని మత్స్యశాఖ అధికారులను కలెక్టర్ సూచించారు. అలాగే ఈనెల 20,21వ తేదీల్లో మద్యం షాపులు మూసివేయాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. సమావేశంలో జాయింట్ పోలీస్ కమిషనర్ ఫక్కీరప్ప, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్.విశ్వనాథన్, సింహాచలం దేవస్థానం ఆలయ ఈవో ఎస్. శ్రీనివాసమూర్తి,, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ఆర్డీవోలు డి.హుస్సేన్ సాహెబ్, ఎస్.భాస్కర్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఏపీఈపీడీసీఎల్ ఎస్.ఈ మహేంద్రనాథ్, డీపీఆర్‌వో ఎస్.వి.రమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాకౌట్‌కు లయన్స్



నాకౌట్‌కు చేరిన లయన్స్ జట్టు



అర్ధసెంచరీ చేసిన ధీరజ్



అర్ధసెంచరీ చేసిన తేజ

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్ మూడో సీజన్ నాకౌట్‌కు ఉత్తరాంధ్ర లయన్స్ చేరుకుంది. వైజాగ్ వారియర్స్‌పై 14 పరుగుల తేడాతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో విజయం సాధించింది. వైఎస్సార్ స్టేడియంలో జరుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచిన వారియర్స్ బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన లయన్స్ ఆరు వికెట్లు కోల్పోయి 197 పరుగులు చేసింది. ఓపెనర్ తరుణ్ (60), మరో బ్యాటర్ ధీరజ్ కుమార్ 25 బంతుల్లో అర్ధసెంచరీ నమోదు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన వారియర్స్ జట్టులో ఓపెనర్లు అశ్విన్ (20), కెప్టెన్ భరత్ (18) తక్కువ పరుగులకే పెవిలియన్ చేరుకున్నారు. దీంతో జట్టు కష్టాల్లో పడింది. 63 పరుగులకే 5 వికెట్లు చేజార్చుకుంది. మరో వైపు వికెట్లు పడుతున్నా తేజ, యువన్ కలిసి స్కోరు బోర్డును పరుగులెత్తించాడు. ఈ క్రమంలో తేజ అర్ధసెంచరీ నమోదుచేశాడు. యువన్‌కు కూడా కేవలం 29 బంతుల్లో 65 పరుగులు చేసి విజయం వైపు ఆశలు కల్పించాడు. అయితే తరువాత వికెట్ల పతనం ప్రారంభ కావడంతో వారియర్స్ జట్టు 183లకు ఆల్‌ఔట్ అయ్యి పరాజయం మూటకట్టుకుంది. దీంతో నాలుగు మ్యాచ్‌ల్లో మూడింట విజయంతో పన్నెండు పాయింట్లు సాధించి ఉత్తరాంధ్ర లయన్స్ జట్టు నాకౌట్‌కు చేరింది.